సాగు చేయని భూములను గుర్తించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

తాసీల్దార్ కార్యాలయంలో క్షేత్రస్థాయి పర్యటనల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్

సూర్యాపేట రూరల్, జనవరి 15: సాగు చేయని భూములను క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించి, భూ యజమానులను రైతు భరోసా పథకానికి అనర్హులుగా గుర్తించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. గురువారం నుంచి గ్రామాల వారీగా జరిగే క్షేత్రస్థాయి పర్యటనల వివరాలను తెలుసుకున్నారు. అధికారులు సమన్వయం చేసుకుంటూ జనవరి 16వ తేదీ నుంచి 20 వరకు గ్రామాల వారీగా క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తూ సర్వే నంబర్ల ప్రకారం సాగు చేయని భూములను గుర్తించాలని తెలిపారు. సాగు చేయని భూముల్లో రాళ్లు, గుట్టలపై సర్వేయర్ ద్వారా వివరాలను సేకరించాలని, పట్టణంలో లేఅవుట్లు, నాలాగా మార్చిన భూములను, ఇండస్ట్రీలకు సంబంధించిన వివరాలను మున్సిపల్ కమిషనర్ ద్వారా సేకరించాలని సూచించారు. సాగు చేయని భూముల వివరాలను జనవరి 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభల్లో తెలియపర్చి, వారిని రైతు భరోసా పథకానికి అనర్హులుగా గుర్తించాలని పేర్కొన్నారు. తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ సక్మిద్దీన్, ఏఓ సందీప్, సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మునగాల, జనవరి 15: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని ఆకుపాముల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకుపాములకు చెందిన రైతు అనంతుల వీరయ్య (56) బుధవారం గ్రామ శివారులోని పొలం వద్దకు బయలుదేరాడు. తన పొలం పక్కనే ఉన్న చల్లా ఏడుకొండలు పొలంలోని ఇనుప కంచె దాటుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటికే ఆ ఇనుప కంచెకు విద్యుత్ వైర్లు చుట్టి ఉండడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గరిడేపల్లి, జనవరి 15: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని ఎల్బీనగర్ శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సర్వారం మాజీ సర్పంచ్ గుమ్మడి అంజయ్య నేరేడుచర్ల నుంచి గరిడేపల్లి వైపు వెళ్తుండగా ఎల్బీనగర్ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో గాయాలపాలైన ఆయనను 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కోదాడ రూరల్, జనవరి 15: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన పట్టణ పరిధిలోని ఆజాద్‌నగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆజాద్‌నగర్‌లో నివాసం ఉంటున్న గోకిరే మోహన్ సంక్రాంతి పండుగ కోసం హుజూర్‌నగర్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలోనే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. గమనించిన పక్కింటి వారు ఇంటి యజమానికి సమాచారంతో అందించడంతో వచ్చి చూడగా.. తులం బంగారం, 15 తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ సీఐ రాము తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెన్‌పహాడ్: గురువులతో పూర్వ విద్యార్థులు

తుంగతుర్తి: వెంపటి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

పెన్‌పహాడ్, జనవరి 15: మండల పరిధి అన్నారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 80 మంది ఒకే వేదికపై కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఎర్రంశెట్టి అంజయ్య, ఎగ్గడి రామనాథం, బోళ్ల సంజీవరెడ్డి, కర్నాటి శ్రీశైలం, సోమగాని వెంకటమహేశ్వర్, అటెండర్లు దేవులపల్లి వెంకటేశ్వర్లు, చెరువుపల్లి సక్కుబాయమ్మను ఘనంగా సన్మానించారు.

తుంగతుర్తి: వెంపటి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ గురువులను ఘనంగా సన్మానించారు.

చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సీతయ్య

తుంగతుర్తి, జనవరి 15: నియోజకవర్గంలోని ఎస్సారెస్పీ కాల్వలకు ప్రభుత్వం విడుదల చేసిన నీళ్లు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలాయని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతో తుంగతుర్తి ప్రాంతంలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 1న ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తే 7వ తేదీ వరకు కూడా కనీసం మైనర్ కాల్వల్లోకి నీరు అందడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ కూలిందనే సాకు చెప్పి అన్నారం, సుందిళ్ల రిజర్వాయర్ల వద్ద లారీలతో అక్రమంగా ఇసుక దందా సాగిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు గుండగాని రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

- ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకుల మండిపాటు
- జిల్లాలో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు

నూతనకల్: పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ శ్రేణులు

నేరేడుచర్ల, జనవరి 15: ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తోందని, బీఆర్ఎస్‌కు కేసులు కొత్త కాదని, ప్రజా సమస్యలపైన పోరాటం ఆగదని బీఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు నిరసనలకు దిగకుండా మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం అనేక పోరాటాలు చేశామని, అదే స్ఫూర్తితో ప్రభుత్వ హామీలు అమలయ్యే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. అరెస్టయిన వారిలో నాయకులు జిలకర రామస్వామి, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

గరిడేపల్లి: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టడానికి సమాయత్తమైన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో నాయకులు పెండెం వీరయ్యగౌడ్, నకిరేకంటి ప్రసాద్, ప్రదాని సైదులు, రాజ్‌మహ్మద్, పిట్ట మైసయ్య, లింగయ్య తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావు, నాయకులు బెల్లకొండ అమర్‌గౌడ్, ములకపల్లి రాంబాబు, కస్తాల రామకృష్ణ, అంజిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఆత్మకూర్.ఎస్: మండలంలో అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మర్ల చంద్రారెడ్డి, కసగాని బ్రహ్మంగౌడ్, మాజీ ఎంపీటీసీ మిర్యాల వెంకటరెడ్డి, గునిగంటి భిక్షం, గిలకత్తుల సోమయ్య, వెంకటరెడ్డి, బొడ్డు మల్సూర్ తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి: బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీశ్ తదితరులను అరెస్ట్ చేశారు.

నాగారం: బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఈదుల కిరణ్, యూత్ నాయకులు కార్తీక్, కిరణ్ తదితరులను అరెస్ట్ చేశారు.

ఆత్మకూర్.ఎస్: పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

నాగారం స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

నూతనకల్: మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మొగుళ్ల వెంకన్న, దేవిరెడ్డి మల్లారెడ్డి, మూరగుండ్ల సైదులు, ఉప్పుల వీరయాదవ్, వీరమల్ల యాదగిరి, సురేందర్, నరేశ్, రాంబాబు, సంతోశ్, మోహన్, కోటేశ్ తదితరులను అరెస్ట్ చేశారు.

పెన్‌పహాడ్: బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగంధర్, సీనియర్ నాయకుడు ఉరుకొండ రాధాకృష్ణ, గ్రామ అధ్యక్షుడు ఎల్లంల జగన్, ఒగ్గు గోపి, గుడపూరి రవి, రంగినేని రాజేశ్, రెహమాన్, రాములు, పర్వతం నాగరాజు, పర్వతం నాగయ్య తదితరులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

పెన్‌పహాడ్‌లో..

నేరేడుచర్లలో..

గరిడేపల్లిలో..

ముగ్గులు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

- మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట టౌన్, జనవరి 15: ముగ్గులు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి కృపాకర్, ఉల్లి రామాచారి, బెజగం ఫణి, మీలా వంశీ, వేణుధర్ పాల్గొన్నారు.

‘సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి’

సైబర్ నేరాలపై యువతకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆత్మకూర్.ఎస్, జనవరి 15: సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ అబ్బగాని సోమయ్య సూచించారు. సైబర్ నేరాలపై బుధవారం మండల కేంద్రంలో యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఆన్‌లైన్ మోసాలతో యువత ఇబ్బందులు పడుతున్నారని, స్పామ్ కాల్స్ ఎవరూ స్వీకరించొద్దని, డిజిటల్ అరెస్ట్ వంటి ప్రచారాలను నమ్మొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సోమని నాగార్జున, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

క్రీడాకారులతో నిర్వాహకులు

నాగారం, జనవరి 15: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాతృమూర్తి సావిత్రమ్మ జ్ఞాపకార్థం సావిత్రమ్మ (ఎస్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగారంలో బుధవారం క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య, ఎల్క సైదులు, అనంతుల సత్తయ్య, చిప్పలపల్లి సోమయ్య, చిప్పలపల్లి రాములు, చిరంజీవి, కూరం వెంకన్న, కన్నెబోయిన మల్లేశ్, కన్నెబోయిన భద్రయ్య, కత్తుల వెంకన్న, దేవరకొండ మురళి, వంగూరి అంజయ్య, చిప్పలపల్లి ఎల్లయ్య, చిప్పలపల్లి పండు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

చిలుకూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా చిలుకూరు కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. పోటీలలో మొదటి బహుమతిని కల్లూరు జట్టు సొంతం చేసుకుంది. విజేతలకు దాతలు, నిర్వాహకులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో క్రీడా నిర్వాహకులు కొండా ఉదయ్, కొండా వినయ్, ముక్కా నవీన్, అమరగాని లింగరాజు, ప్రభాకర్, సాయి, మనోహర్, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ‘రైతు భరోసా’ సర్వే

పాలకవీడు, జనవరి 15: గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో నేటి నుంచి రైతు భరోసా పథకానికి సంబంధించి సర్వే నిర్వహించనున్నట్లు తాసీల్దార్ కమలాకర్ బుధవారం విలేకరులకు తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన భూములు, యోగ్యము కాని భూముల జాబితాను రెవెన్యూ గ్రామాల వారీగా తయారు చేయడానికి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీన మండలంలోని అలింగాపురం, కోమటికుంట, యల్లాపురం గ్రామాల్లో, 17న బొత్తలపాలెం, మహంకాళీగూడెం, సజ్జాపురం, బెట్టెతండా, 18న, గుండ్లపహాడ్, మీడిగంపహాడ్‌తండా, రాఘవాపురం, దేవ్లాతండా, రావిపహాడ్, మూసీఒడ్డుసింగారం, 19న గుండెబోయినగూడెం, శూన్యపహాడ్, గుడుగుంట్లపాలెం, 20న జాన్‌పహాడ్, జాన్‌పహాడ్‌దర్గా, చెర్వుతండా, పాలకవీడు, నాగిరెడ్డిగూడెం, హన్మయ్యగూడెం గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.

చింతలపాలెం: ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి రైతు భరోసా సర్వే నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి శశాంక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న చింతలపాలెం, దొండపాడు, చింత్రియాల గ్రామాల్లో, 17న తమ్మవరం, గుడిమల్కాపురం, 18న వెల్లటూరు, వజినేపల్లి, 19న అడ్లూరు, నెమలిపురి, 20న రేబల్లె, దొండపాడు, చింత్రియాల గ్రామాల్లో సర్వే సాగుతుందని వెల్లడించారు.

చివ్వెంల: మండలంలో 16న చివ్వెంల, ఐలాపురం, తిర్మలగిరి, వట్టిఖమ్మంపహాడ్, 17న ఐలాపురం, చివ్వెంల, ఉండ్రుగొండ, వట్టిఖమ్మంపహాడ్, 18న గాయంవారిగూడెం, బి.చందుపట్ల, గుంపుల, తిమ్మాపురం, 19న కుడకుడ, బీబీగూడెం, దురాజ్‌పల్లి, వల్లభాపురం, 20న కుడకుడ, బీబీగూడెం, గుంజలూరు, తుల్జారావుపేట గ్రామాల్లో సర్వే చేపట్టనున్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

నాగారం: మండలంలో 16న మామిడిపల్లి, లక్ష్మాపురం, శాంతినగర్, నర్సింహుల గూడెం, పేరబోయినగూడెం, 17న ఫణిగిరి, నాగారం, మాచిరెడ్డిపల్లి, 18న ఈటూరు, పసునూరు, వర్ధమానుకోట, 19న డి.కొత్తపల్లి, 20న చెన్నాపురం, పస్తాల, నాగారం బంగ్లాలో సర్వే చేపట్టనున్నట్లు తాసీల్దార్ వి.బ్రహ్మయ్య తెలిపారు.

మద్దిరాల: మండలంలో 16వ తేదీన కుంటపల్లి, రామచంద్రాపురం, జి.కొత్తపల్లి గ్రామాలలో సర్వే ఉంటుందని తాసీల్దార్ అమీన్‌సింగ్ తెలిపారు.

ఆర్థిక సాయం

సూర్యాపేట టౌన్, జనవరి 15: జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఫయీను ద్దీన్, రేష్మల కుమార్తె సీమ వివాహం ఈ నెల 23న జరగనుంది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో వివాహ ఖర్చుల నిమిత్తం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

తుంగతుర్తి: వెంపటి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ బోనగిరి లక్ష్మీనారాయణ ఇటీవల మరణించారు. బుధవారం లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు బీజేవైఎం నాయకుడు సంకినేని వరుణ్‌రావు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా, గ్రామస్తులు అంజయ్య, నాగరాజు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరిడేపల్లి, జనవరి 15: మండల కేంద్రంలోని కల్మల్‌చెర్వు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గరిడేపల్లి టౌన్ ఫీడర్ కింద 11 కేవీ విద్యుత్ స్తంభాలు మార్పు పనులు జరుగుతున్నందున గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ గన్న సాయికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గరిడేపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా లక్ష్మణ్

నేరేడుచర్ల, జనవరి 15: వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా నేరేడుచర్ల పట్టణానికి చెందిన కొత్తా లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

మఠంపల్లి, జనవరి 15:మట్టపల్లి గ్రామంలో గురువారం నుంచి తెలంగాణ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను నిర్వహించనున్నారు. నాలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు లీగ్‌లో పాల్గొననున్నారని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సోలార్ లైట్లు వితరణ

గరిడేపల్లి, జనవరి 15: సంక్రాంతి సందర్భంగా మండల పరిధి పరెడ్డిగూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులకు కందుల వీరనారాయణ, కస్తూరి దంపతులు బుధవారం సోలార్ లైట్లు వితరణ చేశారు. మొత్తం 62 కుటుంబాలకు రూ.96 వేల విలువైన సోలార్ లైట్లను అందజేశారు.

పాటల సీడీ ఆవిష్కరణ

కోదాడ రూరల్/కోదాడ టౌన్, జనవరి 15: తెలంగాణ యాసతో కూడిన పాటలకు ఆదరణ ఎక్కువని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, టీడబ్ల్యూజే 143 జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అంజన్‌గౌడ్ అన్నారు. కోదాడ పట్టణ పరిధి కొమరబండకు చెందిన యువ గాయకుడు, రచయిత దేవపంగు ఇంద్రకుమార్ రచించి, ఆలపించిన శ్రీలింగమంతులస్వామి గొల్లగట్టు జాతర పాటల సీడీని బుధవారం కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో వారు ఆవిష్కరించి మాట్లాడారు. పడిశాల రఘు, గుగులోతు సురేశ్, పుట్టా వెంకటేశ్, నేలమర్రి శ్రీకాంత్, సాయి, కృపారావు, గణేశ్, గోపి పాల్గొన్నారు.

‘ఇండ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలి’

మద్దిరాల, జనవరి 15: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగయ్య, తాసీల్దార్ అమీన్ సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్వే సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో సర్వే పూర్తికాని గ్రామాల్లో నేటి నుంచి మళ్లీ సర్వే మొదలుపెట్టాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికకు కొద్ది రోజులు మాత్రమే సమయం ఉందని, కాబట్టి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి బియ్యం వితరణ

నూతనకల్, జనవరి 15: మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు అనంతుల లింగయ్య ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రగాయాల పాలయ్యాడు. కుటుంబం గడిచే పరిస్థితి లేక పోవడంతో అదే గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏనుగుతల చంద్రయ్య, సవేందర్‌రెడ్డి బాధిత కుటుంబానికి బుధవారం క్వింటా బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొంగల నరేశ్, గుండా శరత్, అనంతుల సాయి, మాశిరెడ్డి వెంకటరెడ్డి, గాడుదుల స్వామి, బోయిని అశోక్, దూదిమెట్ల మహేశ్, గౌడిచర్ల నరేశ్ పాల్గొన్నారు.

‘వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలి’

కోదాడ రూరల్: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్

కోదాడ రూరల్, జనవరి 15: వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించాలని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం పట్టణ పరిధిలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని, అతివేగం ప్రమాదాలకు కారణమని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ఆధ్వర్యంలో ఖమ్మం క్రాస్‌రోడ్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం: మండల కేంద్రంలోని సూర్యాపేట - జనగాం జాతీయ రహదారి 365బీపై ఎస్ఐ ఐలయ్య ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు.

మద్దిరాల: మండల కేంద్రంలో ఎస్ఐ వీరన్న ఆధ్వర్యంలో వాహనదారులతో ర్యాలీ నిర్వహించారు.

‘ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగాలి’

మఠంపల్లి, జనవరి 15: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాసీల్దార్ మంగా రాథోడ్, ఎంపీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడంపై అవగాహన కల్పించారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని, ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రతి అధికారి విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఏడీఏ రవినాయక్, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులుపాల్గొన్నారు.

సంక్రాంతి సంబురం

గరిడేపల్లి: ఎల్బీనగర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

సూర్యాపేట టౌన్, జనవరి 15: సంక్రాంతి పండుగను జిల్లావ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇండ్ల ముందు అందమైన ముగ్గులు వేసి రంగులు అద్దడంతో పాటు గొబ్బెమ్మలను ఉంచారు. చిన్నాపెద్దా తేడా లేకుండా గాలిపటాలు ఎగరేశారు. ప్రజలు ఆలయాలకు వెళ్లి తమ ఇష్ట దైవాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు సొంతూళ్లకు రావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. యువత, చిన్నారులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. రైతులు పశువులను అలంకరించి పూజించారు.

నేరేడుచర్ల: సంక్రాంతి సందర్భంగా మండలంలోని జానల్‌దిన్న గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండలంలోని పొనుగోడు, సర్వారం, ఎల్బీనగర్ తదితర గ్రామాల్లో ముగ్గుల పోటీలను నిర్వహించారు.

నాగార